# నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల
వనపర్తి

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




గద్వాల సమీపంలోని జములమ్మ ఆలయం, ఇన్‌సెట్లో (జములమ్మ మూలవిరాట్)

## నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- వేలాదిగాతర లిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

గద్వాల రూరల్, ఫిబ్రవరి 19 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ బ్రహ్మోత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఉదయం 11గంటలకు అమ్మవారిని ఆహ్వానించడానికి ఆమె పుట్టినిల్లు అయిన గుర్రంగడ్డ(దివి గ్రామం)కు బయలు దేరుతుంది. అమ్మవారి కోసం ఎద్దుల బండిని సిద్ధం చేస్తారు. మరుసటి రోజు మెట్టినింటికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మాఘశుద్ధ పౌర్ణమి రోజు అనగా 24వ తేదీ నుంచి ప్రతి మం గళ, శుక్రవారాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొ క్కులు చెల్లించుకోవడంఆ నవాయితీ.

**అమ్మవారి ఆలయ చరిత్ర..**

గద్వాల పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న జములమ్మ దేవస్థాన ప్రాంతం ఒకప్పుడు ఈత వనం. అక్కడికి సమీపంలో జమ్మిచేడు గ్రామం ఉన్నది. ఆ గ్రామానికి చెందిన రైతు ఒకరు పొలాన్ని దున్నేందుకు నాగలితో ఆ ప్రాంతానికి వచ్చాడు. నాగలి లోతుకు పోవడానికి బరువు కోసం సమీపంలో ఉన్న ఒక రాయి తెచ్చి పొలం దున్నాడు. సాయం త్రం నాగలి వదిలి ఇంటికి పోయాడు. మరుసటి రోజు దున్నడానికి పొలానికి రాగా నాగలిపై ఉన్న రాయి కనిపించలేదు. అది యథాస్థానానికి చేరుకున్నది. మళ్లీ తెచ్చి నాగలితో దున్ని వదిలిపోయాడు. ఆ మరుసటి రోజూ మళ్లీ రాయి యథాస్థానానికి చేరుకున్నది. ఇలా ఎవరో కావాలని చేస్తున్నారని వారిని కనిపెట్టడానికి ఆ రాత్రి అక్కడే చాటుగా ఉన్నాడు. నిద్ర రాకుండా ఉండేందుకు చిటికెన వేలును సైతం కోసుకున్నాడు. సరిగ్గా అర్ధ రాత్రి 12గంటల ప్రాంతంలో నాగలిపైన ఉన్న రాయి అందమైన దేవతారూపం దాల్చి రైతు తెచ్చిన ప్రదేశం వరకు పోయి మళ్లీ రాయిగా మారింది. దీనిని చూసిన రైతు విషయం గ్రామస్తులకు చెప్పాడు. వారు నమ్మకపోతే మరుసటి రోజు వారికి చూపించాడు. అప్పటినుంచి ఆ గ్రామం వారు ఆ రాయిని ప్రతిష్ఠించి జములమ్మ దేవతగా కొలుస్తున్నారు. అయితే 1983లో రిజర్వాయర్‌ను నిర్మించడం వలన అమ్మవారి దేవాస్థానం ముంపునకు గురైంది. అక్కడి నుంచి అమ్మవారిని తియ్యడానికి ప్రయత్నించినా వారికి కండ్లు కనిపించలేదనేది ప్రచారంలో ఉన్నది. దీంతో చుట్టూ కరకట్టను కట్టి ఆలయాన్ని అభివృద్ధి చేశారు.

**బ్రహ్మోత్సవాలకు పూర్తైన ఏర్పాట్లు..**

బ్రహ్మోత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, దర్శనానికి ఇబ్బందులు పడకుండా క్యూలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, 30 గదులను అందుబాటులో ఉంచారు. వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూరల్ ఎస్సై పర్వతాలు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. వచ్చే భక్తులకు ఆలయం వరకు ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేశారు.

## పీయూకు రూ.100కోట్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

- పాలమూరునుస్ట డీ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

పాలమూరు, ఫిబ్రవరి 19 : పాలమూరు విశ్వ విద్యాలయానికి పీఎం ఉషా (అంతకు ముందు ప్రధానమంత్రి ఉచ్చతల్ శిక్షా అభియాన్) రూసా (రాష్ట్రీయా ఉచ్చత్తర్ శిక్షా అభియాన్)తో పాటు మీరు పథకం ద్వారా రూ.100కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం పీయూ పరిపాలన భవనంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన పాలమూరు జిల్లాకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. యూనివర్సిటీలో అన్నిరకాల మల్టీ కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. తాము పంపిన ప్రతిపాదనలను పరిశీలించి నిధుల మంజూరుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి విశ్వవిద్యాలయానికి మరో రూ.50 కోట్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని, పీయూ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో వోఎస్‌డీ డా.మధుసూదన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ.పిండి పవన్‌కుమార్, వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు డా.చంద్రకిరణ్, డా.సుజాత, డా.బషీర్‌అహ్మద్, డా.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాలను వెల్లడిస్తే తప్పుడు కేసులా..?

- బీఆర్‌ఎస్‌నే తలపైక క్షసా ధింపు చర్యలు

కొత్తకోట, ఫిబ్రవరి 19 : నిజాలు వెల్లడిస్తే జీర్ణించుకోలేని స్థానిక ఎమ్మెల్యే బీఆర్‌ఎస్‌కు చెందిన నేతలపై కేసులు బనాయించారు. దేవరకద్ర నియోజకవర్గంలోని చింతకుంట మండలానికి చెందిన నర్సింహ, కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన గోవింద్‌నాయుడును అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే కేసుల పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దేవరకద్రకు వంద పడకలు, కొత్తకోటకు 50 పడకల దవాఖానలు మంజూరు చేయాలని అసెంబ్లీలో కోరారు. అయితే గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఈ వైద్యశాలలకు నిధులు మంజూరవగా నాటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపనలు చేశారు. ఈ ఆధారాలను వాట్సాప్‌లో పోస్టు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చి ఇరువురిపై కేసులు నమోదు చేయించారు. గోవిందును అరెస్టు చేయడానికి వెళ్లగా.. లేకపోవడంతో ఆయన తల్లి, భార్యను స్టేషన్‌కు రావాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో చేసేది లేక నాయుడు ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో వచ్చి సంతకం చేసి వెళ్లాడు. ఇక నర్సింహను మాత్రం రోజూ రాత్రిళ్లు పీఎస్‌లో కూర్చోబెట్టుకొని తెల్లారక ఇంటికి పంపిస్తున్నారు. దీంతోపాటు ఫోన్లల్లో ఆయన్ను అసభ్యకరంగా దుర్భాషలాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిజాన్ని నిర్భయంగా తెలియజేస్తే ఇబ్బందులపాలు చేయడం సరికాదన్నారు.

## ఛత్రపతి పాలనలో వ్యవసాయానికి ప్రాధాన్యం

- శివాజీ జయంతి వేడుకల్లో మాజీమ ంత్రినిరం జన్‌రెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 19 : ఆనాటి పాలనలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం కల్పించి వ్యవసాయంపై తన మక్కువను చాటుకున్న గొప్ప మహోన్నతి వ్యక్తి ఛత్రపతి శివాజీ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని శివాజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ శివాజీ మహరాజ్ భారతదేశం గర్వించే దిశగా ప్రజా సంక్షేమం, మహిళా రక్షణ, హైందవ సంస్కృతులకు ప్రాధాన్యం కల్పించారన్నారు. ఆయన చేసిన సాహసోపేతమైన నిర్ణయాలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు నాగన్నయాదవ్, పాకనాటి కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు చెన్నరాములు, ఉంగ్లం తిరుమల్, ఎల్ఐసీ కృష్ణ, పరంజ్యోతి, గులాంఖాదర్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గిరి, ఎర్ర శ్రీనివాసులు, జగదాంబ యూత్ సభ్యులు వినోద్‌గౌడ్, సుబ్బు, గణేశ్‌గౌడ్, రాహుల్, వంశీకృష్ణ, శివగౌడ్, చీర్ల రాజేందర్, శివసాగర్ తోపాటు యువకులు పాల్గొన్నారు.



వనపర్తిలో ఛత్రపతి శివాజీవిగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న మాజీమ ంత్రిని రంజన్‌రెడ్డి

- రూ.1800 కోట్లతో జాతీయ రహదారి
- సంవత్సరంలోగా పూర్తి చేసేలా చర్యలు
- వేసవిలో సోమశిల తీగల వంతెన పనులు
- భూసేకరణపై రెవెన్యూ అధికారుల దృష్టి
- తిరుపతికి తగ్గనున్న దూరభారం



తారు వేయడంతో తళుకులీనుతున్న హైవే

# హై వేగంగా..

**చకచకా.. కల్వకుర్తి-నంద్యాల రోడ్డు పనులు**

### రూ.1,800 కోట్లతో 167-కే హైవే..

నాగర్‌కర్నూల్ జిల్లాలో కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి (167కే) పనులు చకచకా సాగుతున్నాయి. పనులు వేగంగా పూర్తి చేసేలా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. రూ.1,800 కోట్ల భారీ నిధులతో పనులు చేపట్టనున్నారు. తొలి విడుతలో రూ.400 కోట్ల విలువైన పనులను నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం చివరి నాటికి పనులను పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించుకొని పనులు చేస్తున్నారు. ఈ మార్గం పూర్తయితే ఏపీ (రాయలసీమ)తోపాటు తెలంగాణను మరింత దగ్గర చేయనున్నది. కల్వకుర్తి మండలం కొట్ర నుంచి ఈ రోడ్డు ప్రారంభమవుతున్నది. ఇలా 173 కిలోమీటర్ల దూరంలో నంద్యాల వరకు జాతీయ రహదారి నూతనంగా నిర్మాణం కానున్నది. ఈ పనుల్లో భాగంగా 10 మీటర్ల వెడల్పుతో బీటీ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇలా మూడు వరుసల్లో రోడ్డు ఉండనున్నది. ఇక కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ కేంద్రాల్లో నాలుగు వరుసలతో పాటుగా రోడ్డుకు ఇరువైపులా పేవ్‌మెంట్ వే పనులు చేపడతారు. అలాగే పది చోట్ల బైపాస్, సర్వీస్ రోడ్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ రోడ్లను ఇరువైపులా విస్తరిస్తున్నారు. గోతులు లేకుండా, ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతాన్ని మట్టి, కంకరతో నింపి, రోడ్డు రోలర్‌తో చదును చేసి ఆ పైన బీటీ వేస్తున్నారు. అలాగే అక్కడక్కడా చిన్న కల్వర్టులు, బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. రోడ్డు మొత్తం సమాంతరంగా ఉండేలా ఈ పనులను చేపడుతున్నారు.

### సోమశిల వద్ద ఐకానిక్ వారధి

అదే విధంగా కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద ఐకానిక్ వంతెన (తీగల బ్రిడ్జి) నిర్మించనుండటం గమనార్హం. రూ.600 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతిష్టాత్మకంగా వారధిని నిర్మించనున్నారు. ఈ పనులు రాబోయే ఎండాకాలంలో ప్రారంభించే అవకాశం ఉన్నది. కృష్ణానదికి వరద లేకపోవడంతో పాటుగా సామశిల-సిద్ధేశ్వరం మధ్య నీటి ప్రవాహం తగ్గనుండటంతో నిర్మాణం చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ బ్రిడ్జి మీదుగా వాహనాలు వెళ్లడంతో పాటుగా కింద నుంచి సందర్శకులు నడుచుకుంటూ వెళ్లేలా నిర్మాణం చేపట్టనున్నారు. ఇక్కడి నుంచి సందర్శకులు కృష్ణమ్మ నదీ సోయగాలను, నల్లమల అటవీ అందాలను వీక్షించనున్నారు. ఈ బ్రిడ్జి పర్యాటకులకు ఓ మధురానుభూతిని మిగిల్చేలా ఏర్పాట్లు చేయనున్నారు.

### తగ్గనున్న దూరభారం

ప్రస్తుతం జరుగుతున్న హైవే పనులతో ఇప్పటికే నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్, కల్వకుర్తికి వెళ్లే ప్రయాణ సమయం దాదాపుగా 15 నిమిషాల వరకు తగ్గింది. రోడ్డు పనులన్నీ పూర్తయితే హైదరాబాద్- తిరుపతి మధ్య దాదాపుగా 80 కిలోమీటర్ల దూరం తగ్గనున్నది. ప్రస్తుతం తిరుపతితో పాటుగా చెన్నై, ఇతర ఏపీలోని సీమ ప్రాంతాలకు వెళ్లాలంటే జడ్చర్ల మీదుగా ఉన్న జాతీయ రహదారి (హైవే-44) మీదుగా వెళ్లాలి. దీంతో ఒకటే మార్గం ఉండడంతో రోడ్డుపై వాహనాల రద్దీ బాగా పెరిగింది. దీని వల్ల రోడ్డు ప్రయాణాలు వాహనదారులకు భారంగా మారాయి. కల్వకుర్తి-నంద్యాల పనులు పూర్తయితే ప్రయాణికులకు దూరభారంతో పాటుగా ఆర్థికంగానూ కలిసి వస్తుంది. ఈ రోడ్డుపై గరిష్ఠ వేగం వంద కిలోమీటర్లుగా నిర్ణయించనున్నారు. ఫలితంగా వాహనదారులకు దాదాపు రెండు గంటల ప్రయాణ సమయం తగ్గుతుంది.



నాగర్‌కర్నూల్ జిల్లాలో సాగుతున్న రోడ్డు పనులు

*కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.1800 కోట్ల వ్యయం కానుండగా.. తొలి విడుతలో రూ.400 కోట్లతో ప్రారంభమైన పనులు వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. పెండింగ్ భూసేకరణలో జాప్యాన్ని తగ్గించేందుకు జిల్లా రెవెన్యూ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. దీంతో వచ్చే సంవత్సరంలోగా తిరుపతి ప్రయాణికులకు దూరభారం తగ్గనున్నది.*

*– నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ)*

**గడువులోగా పనులు**



కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి పనులు వేగంగా జరిగేలా అధికారులతో పర్యవేక్షిస్తున్నాం. పనుల కోసం నాగర్‌కర్నూల్ జిల్లాలో 362 ఎకరాలు సేకరించాల్సి ఉన్నది. మండల స్థాయిలో అధికారులు సంబంధిత రైతులతో మాట్లాడుతున్నారు. త్వరలో భూసేకరణపై నోటిఫికేషన్ జారీ చేస్తాం. గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

**- ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్**

### భూసేకరణ పూర్తికి చర్యలు

హైవే 167-కే పనుల్లో ప్రధానమైన భూ సేకరణను పూర్తి చేసేలా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల కోసం 362 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నది. కల్వకుర్తిలో 106 ఎకరాలు, నాగర్‌కర్నూల్‌లో 76 ఎకరాలు, తాడూరులో 63 ఎకరాలు, కొల్లాపూర్‌లో 50 ఎకరాలు, పెద్దకొత్తపల్లిలో 40 ఎకరాలు, తెలకపల్లి మండలంలో 0.51 ఎకరాల చొప్పున భూసేకరణ పెండింగ్‌లో ఉండగా త్వరలో పూర్తి చేసి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

## ధైర్య సాహసాలకు ప్రతీక ఛత్రపతి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- ఉప్పేరులో శివాజీ విగ్రహావిష్కరణ

ధరూరు, ఫిబ్రవరి 19 : ధైర్య సాహసాలకు ప్రతీక ఛత్రపతి శివాజీ మహరాజ్ అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం మండలంలోని ఉప్పేరులో ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే బండ్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్ చక్రవర్తులను ఎదిరించి, వినూత్నమైన యుద్ధ వ్యూహాలతో మరాఠ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసిన యోధుడు ఛత్రపతి శివాజీ అన్నారు. అంతటి ధైర్య సాహసాలు కలిగిన మహరాజ్ విగ్రహాన్ని గ్రామంలో ప్రతిష్ఠించుకోవడం గర్వంగా ఉందన్నారు. అందరూ గ్రామంలో ఐక్యతగా ఉండి అందరి సంక్షేమం కోసం కృషి చేయాలని, అందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, గట్టు ఎంపీపీ విజయ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జాంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, రఘువర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, కరుమన్న, ఆరె కటిక సంఘం జిల్లా, గ్రామ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఉప్పేరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ముక్తార్‌అలీ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.



ఉప్పేరులో శివాజీవిగ్రహాన్నిఆ విష్కరించినగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన ధీరుడు శివాజీ

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలకొండ బైపాస్‌రోడ్డులో శివాజీ విగ్రహం ఆవిష్కరణ

పాలమూరు, ఫిబ్రవరి 19 : దేశ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటిన ధీరుడు ఛత్రపతి శివాజీ మహరాజు అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలకొండ బైపాస్ రోడ్డులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ శివాజీ మహరాజ్ భారతదేశం గర్వించే దిశగా ప్రజా సంక్షేమాన్ని అమలు చేశారని, హైందవ సంస్కృతిని కాపాడారని కొనియాడారు. ఛత్రపతి శివాజీ, అంబేద్కర్, జ్యోతిబాపూలే, స్వామి వివేకానంద, పండుగ సాయన్న వంటి వారు దేశం , ప్రజల కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. ఇలాంటి మహనీయుల విగ్రహాలను చూసి వారిని స్మరించుకోవడంతోపాటు వారి ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. దేశం కోసం, సమాజంలో మార్పుకు తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల గురించి భవిష్యత్ తరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శివాజీ విగ్రహ ఏర్పాటుకు పాలకొండ యువత ముందుకు వస్తే బైపాస్‌లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించానని, వెంటనే వారు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్లు గణేశ్, నరేందర్, కట్టా రవికిషన్‌రెడ్డి, వేదావత్, శ్రీనివాసులు, కిశోర్‌కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కృష్ణమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సతీశ్, రవికుమార్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ బైపాస్‌రోడ్డులో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## అమ్మా.. చల్లంగా చూడు



జోగుళాంబఆ లయంలో పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యేలు

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- జోగుళాంబను దర్శించుకొన్న మంత్రి, ఎమ్మెల్యేలు

అలంపూర్, ఫిబ్రవరి 19 : అమ్మా.. జోగుళాంబదేవీ రాష్ట్ర ప్రజలను ఎప్పుడూ చల్లంగా చూడాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు వేడుకున్నారు. ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను సోమవారం ఆయన దర్శించుకొన్నారు. అంతకుముందు ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్ని కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి బాలబ్రహ్మేశ్వరస్వామికి అభిషేకం, జోగుళాంబ దేవీకి ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆలయాల సమీపంలోని షా-అలీ పహిల్వాన్ దర్గాను కూడా దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి వెంట ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కలెక్టర్ సంతోష్, ఎస్పీ రితిరాజ్‌తోపాటు ఆలయ అధికారులు, అర్చకులు, పలువురు నాయకులు ఉన్నారు.

## ఘనంగా బీరప్ప బండారు ఉత్సవం

- వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నేతలు

మరికల్, ఫిబ్రవరి 19 : మరికల్‌లో సోమవారం బీరప్ప బండారు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఐదేండ్లకు ఒకసారి నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా కురుమ యాదవులు ఉదయం నుంచే బీరప్ప ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి ఒకరిపై ఒకరు బండారు చల్లుకొన్నారు. ఈ ఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా కురుమ యాదవులు ఆయనను పూలమాల, శాలువా, గొంగడితో సన్మానించారు. అదే వి ధంగా తీలేరులోనూ కురుమయాదవులు బీరప్ప ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం ఎల్లమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ గౌని సురేఖారెడ్డి, మాజీ సర్పం చ్ కస్ప్ గోవర్ధన్, నాయకులు తిరుపతయ్య, శ్రీనివాసు లు, రాజేశ్, మతీన్, కృష్ణయ్య పాల్గొన్నారు.

**మాణికేశ్వరీమాత విగ్రహ ప్రతిష్ఠాపన..**

మరికల్ మండలంలోని మద్వార్ గ్రామంలో మాతా మాణికేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ధన్వాడ సింగిల్‌విండో చైర్మన్ వెంకట్రాంరెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుణ్యశీల, రాజులయ్యతోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కందనూలులో కారు బీభత్సం

- నలుగురికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 19 : కారు బీభత్సం సృష్టించిన ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. వివరాలు ఇలా.. నారాయణపేట జిల్లాకు చెందిన రవికుమార్, జనార్దన్‌తో పాటు మరో ఇద్దరు రెండు బైక్‌లపై శ్రీశైలం దైవ దర్శనానికి బయలుదేరారు. సోమవారం నాగర్‌కర్నూ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న సరస్వతీ ఆలయం వద్దకు రాగానే నాగర్‌కర్నూల్‌కు చెందిన విజయేందర్‌రెడ్డి తన భార్య మంజులతో కలిసి కారు(టీఎస్ 31ఎఫ్ 7470)లో అచ్చంపేట వైపు వేగంగా వెళ్తుండగా.. ముందు వెళ్తున్న వాహనాలపై దూసుకెళ్లింది. దీంతో రెండు బైకులపై ఉన్న నలుగురు తీవ్రగాయాలు కాగా వారిని జిల్లా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారు యాజమాని ఇంటెలిజెన్సీ విభాగంలో పనిచేస్తున్న వ్యక్తిగా అనుమానిస్తున్నారు.